

హాజరు 20,775

కానిస్టేబుల్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆదివారం జిల్లావ్యాప్తంగా పరీక్ష నిర్వహించారు. 20775 మంది పరీక్ష రాశారు. - 8లో..



అక్కినేని విగ్రహం ఏర్పాటు చేస్తాం

అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా ఒంగోలులో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. - 10లో..

గరిష్టం/కనిష్టం
30 /19

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

త్రిపురాంతకంలో హైకోర్టు జడ్జి పూజలు



ఆలయం వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి మల్లికార్జునరావు

త్రిపురాంతకం: త్రిపురాంతకంలో శ్రీబాలాత్రిపురసుందరీదేవి, పార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో హైకోర్టు న్యాయమూర్తి టీ మల్లికార్జునరావు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్రిపురాంతకం ఆలయాలకు వచ్చిన ఆయనకు అర్చకులు ప్రసాద శర్మ, విశ్వనారాయణశాస్త్రి, ఈఓ చెన్నకేశవరెడ్డి స్వాగతం పలికారు. అమ్మవారి ఆలయంలో కుంకుమార్చనలు, స్వామివారి ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. ఆయన వెంట ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పద్మజ మల్లికార్జున్ ఉన్నారు.

నేడు ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు

కందుకూరు రూరల్: స్థానిక ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ ఆవరణలో సోమవారం ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయిలో సబ్ జూనియర్ క్యాడెట్, జూనియర్, సీనియర్ బాల బాలికల తైక్వాండో పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా తైక్వాండో కార్యదర్శి అబ్దుల్ సలాం ఆదివారం తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 28, 29, 30 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

26న బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం

ఒంగోలు: ఈనెల 26న స్థానిక విష్ణుప్రియ ఫంక్షన్ హాలులో ఉదయం 11 గంటలకు జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు, జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లా కార్యదర్శులు, జిల్లా మోర్చా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గసభ్యులు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.



పక్కాగా ఉచిత బియ్యం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బియ్యం పంపిణీని పక్కాగా లబ్ధిదారులకు అందిస్తున్నారు. రేషన్ వాహనాల ద్వారా ఇంటి ముంగిటకు వెళ్లి బియ్యాన్ని అందజేస్తున్నారు. ప్రతి నెలా జిల్లాలో 85 నుంచి 90 శాతం పంపిణీ చేస్తున్నారు. ఇప్పటి వరకూ కిలో బియ్యాన్ని రూ.1కి అందజేస్తున్నారు. ఇక నుంచి కార్డుదారులకు ఉచితంగా ఇవ్వనున్నారు. ప్రతి నెలా జిల్లాలో 9,220 టన్నులు ఉచితంగా పంపిణీ చేయనున్నారు.

- కొత్త సంవత్సరం జనవరి నుంచి ఏడాదిపాటు ఉచితంగా పంపిణీ
- రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులతో కార్డుదారుల్లో సంతోషం
- నెలకు 9,220 టన్నుల పంపిణీ
- 385 వాహనాల ద్వారా ఇంటి వద్దకే బియ్యం
- 6,59,576 కార్డుదారుల కుటుంబాలకు లబ్ధి

ఒంగోలు అర్బన్: పేద, బడుగు, బలహీన వర్గాలకు రేషన్ బియ్యాన్ని ఇక నుంచి పూర్తి ఉచితంగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. ఆ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసి జనవరి నుంచి ఉచితంగా పంపిణీ ప్రారంభించింది. గతంలో కిలో రూ.2 ఉండే బియ్యం వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1కే బియ్యం పంపిణీ చేసింది. తాజాగా ఆ రూపాయి కూడా లేకుండా పూర్తి ఉచితంగానే కార్డుదారులకు బియ్యం పంపిణీ చేస్తోంది. రేషన్ కార్డుదారులకు కార్డులోని ఒక్కొక్కరికి 5 కేజీల చొప్పున రేషన్ బియ్యాన్ని ఒక్క రూపాయికే అందిస్తున్న ప్రభుత్వం నూతన సంవత్సరంలో ఏడాది పాటు పూర్తి ఉచితంగా బియ్యం పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంది. రేషన్ వాహనాల ద్వారా అందించే పంచదార, కందిపప్పునకు మాత్రమే డబ్బులు తీసుకుంటారు. కేజీ కందిపప్పు రూ.67, అరకిలో పంచదార రూ.17 తీసుకుని బియ్యం మాత్రం ఉచితంగానే అందిస్తారు. ఈఏఏవై కార్డుదారులకు కేజీ పంచదార రూ.13.50కే అందించేలా ప్రభుత్వం చర్యలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కార్డుదారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. జిల్లాలో 6,59,576 మంది కార్డుదారుల కుటుంబాలకు 9220 టన్నులు, బాపట్ల జిల్లాలో 4,80,057 మంది కార్డుదారుల కుటుంబాలకు 1123 టన్నుల బియ్యం సరఫరా అవుతోంది. కార్డులో ఉండే ప్రతి ఒక్కరికీ ఐదు కేజీల చొప్పున ప్రతి నెలా బియ్యం పంపిణీ చేస్తారు. జిల్లాలో ఉన్న 1392 రేషన్ దుకాణాల ద్వారా 385 రేషన్ పంపిణీ వాహనాల ద్వారా కార్డుదారుల ఇంటి వద్దకే బియ్యాన్ని అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రభుత్వం ఇంటింటికీ వాహనాల ద్వారా రేషన్ సరుకులు సరఫరా చేయడంతో పాటు ఉచితంగా బియ్యాన్ని అందించడం పట్ల పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం పట్ల పేదల ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.



ఎండీయూ వాహనం ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్న సిబ్బంది

బియ్యం ఉచితంగా అందిస్తాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్డుదారులకు బియ్యం ఉచితంగా అందిచేందుకు చర్యలు తీసుకున్నాం. పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగేలా సివిల్ సప్లయిస్ అధికారులకు తగిన సూచనలు చేశాం. బియ్యం మినహా ఇతర వస్తువులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలు చెల్లించి తీసుకోవాలి.

– ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్

ఇంటి వద్దకే రేషన్ సరుకులు



ప్రజలకు రేషన్ సరుకులు ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే పంపిణీ చేస్తున్నాం. 385 వాహనాలతో కార్డుదారుల వద్దకే సరుకులు పంపిణీ చేస్తున్నాం. జిల్లాలో 85 నుంచి 90 శాతం వరకు ప్రతి నెలా రేషన్ పంపిణీ విజయవంతంగా జరుగుతోంది. అయితే ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం మేరకు బియ్యం పూర్తి ఉచితంగా కార్డు ఒక్కొక్కరికి 5 కేజీల చొప్పున పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నాం. ఏడాది పాటు ఉచిత బియ్యం పంపిణీ కొనసాగుతుంది.

– అభిషిక్త్ కిషోర్, జాయింట్ కలెక్టర్

గడప గడపలోను జగనన్న అభిమానులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, పక్కన మంత్రి ఆదిమూలపు సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎంపీ బీద మస్తాన్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: ప్రతి గడపలోనూ జగనన్న అభిమానులు ఉన్నారని.. తప్పుడు ప్రచారాలు చేస్తూ అవాస్తవాలతో మభ్యపెట్టాలనుకున్న వారి ప్రచారానికి తెరవేయడమే లక్ష్యంగా జగనన్న సైనికులు పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జగనన్న సచివాలయాల మండల/క్లస్టర్ కన్వీనర్లకు ఆయన పలు సూచనలు చేశారు. ఈ సైన్యంలో పనిచేసే ప్రతి వ్యక్తి పేరు జగనన్న మదిలో ఉంటుందని, మీరు నేరుగా జగనన్న సైన్యం అని గుర్తుంచుకుని పనిచేయాలన్నారు. ప్రతి నియోజకవర్గంలోను పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా కృషి కొనసాగాలన్నారు. ఎమ్మెల్యేల గ్రాఫ్‌ను పెంచాలనే లక్ష్యంతోనే గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి సీఎం శ్రీకారం చుట్టారన్నారు. అన్ని నియోజకవర్గాల్లో పార్టీని గెలిపించుకునేందుకే ఈ కార్యక్రమమన్నారు. మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ ప్రస్తుతం పనిచేస్తున్న వలంటీర్లు సచివాలయాల పరిధిలో ప్రతి 50 ఇళ్లకు ఒకరుగా ఉంటూ గౌరవ వేతనం పొందుతూ సేవలు అందిస్తున్నారన్నారు. అయితే వారి సేవలకు ఒక గుర్తింపు లభించింది జగన్‌మోహన్‌రెడ్డి వల్ల కావడంతో వారికి సాధారణంగా వైఎస్సార్ సీపీ పట్ల అభిమానం ఉండడంలో తప్పులేదన్నారు. అంత మాత్రాన వారి పట్ల దారుణంగా వ్యవహరిస్తూ పచ్చ పత్రికలు రాస్తున్న రాతలను తిప్పికొట్టేందుకే జగనన్న సైన్యాన్ని రూపొందిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బీదా మస్తాన్‌రావు మాట్లాడుతూ 2024 పార్టీ ఎన్నికల్లో జగనన్న సచివాలయ కన్వీనర్లు కీలకంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న వలంటీర్లు ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లడంలో కృషి చేస్తున్నారని, కానీ జగనన్న సచివాలయ వలంటీర్లు మాత్రం పార్టీ ఇమేజ్ పెంచేందుకు, ఎక్కడైనా సమస్యలుంటే తక్షణమే పార్టీ దృష్టికి తీసుకురావడం ద్వారా న్యాయం చేసేందుకు చర్యలు వేగవంతం అవుతాయన్నారు. రెండు రోజులపాటు నియోజకవర్గాల వారీగా కూడా మండలాల కన్వీనర్లతో సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ పార్టీకి, ప్రజలకు మధ్య అనుసంధానకర్తలుగా వ్యవహరిస్తూ వైఎస్సార్‌సీపీ గెలుపులో కీలకంగా జగనన్న సైనికులు పనిచేయాలన్నారు. వలంటీర్ల వ్యవస్థపై టీడీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడమే లక్ష్యంగా ప్రతి మండల పరిధిలో కనీసంగా 800 నుంచి వెయ్యిమంది సిద్ధం కావాలన్నారు. ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతిగా నిలిచిన వైఎస్సార్‌సీపీ విజయంలో కీలక పాత్ర పోషించబోతున్న జగనన్న సైనికులకు శుభాకాంక్షలు తెలిపారు. జగనన్న సచివాలయాల రాష్ట్ర కోఆర్డినేటర్ శివశంకరరెడ్డి మాట్లాడుతూ ప్రతి 50 ఇళ్లకు ఇద్దరు రథసారథులు, ప్రతి గ్రామంలో ముగ్గురు వలంటీర్లు, మండలానికి ఒక కన్వీనర్లు అందరూ స్థానిక నాయకత్వాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. ఇప్పటికే మండల కన్వీనర్ల నిర్మాణ ప్రక్రియ 90 శాతం పూర్తయిందని, మిగిలిన వారిని సైతం ఈనెల 30వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. అదే విధంగా గృహ రథసారథుల ఎంపికకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం వద్ద 2.60 లక్షల మంది వలంటీర్లు ఉన్నారని, కానీ వైఎస్సార్‌సీపీ వద్ద, జగనన్న సైన్యంలో 5.20 లక్షల గృహ సారథులు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఇక వలంటీర్లు, మండల కన్వీనర్లు కలుపుకుంటే 26 జిల్లాలో 8 లక్షల సైన్యం ఉండబోతుందంటూ మండల కన్వీనర్ల బాధ్యతలు, విధి విధానాలు తదితరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్సీ పోతుల సునీత, ఎమ్మెల్యేలు బుర్రా మధుసూదన్ యాదవ్, కుందురు నాగార్జున రెడ్డి, మద్దిశెట్టి వేణుగోపాల్, నగర మేయర్ గంగాడ సుజాత, కొండపి ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, పరిశీలకులు ఆదిశేషగిరి రావు పాల్గొన్నారు.

దసరా నాటికి నూతన కార్యాలయం

- కార్యకర్తలు, నాయకుల్లో మనోధైర్యం కల్పించడమే లక్ష్యం
- అసంతృప్తులు మీడియా సృష్టే
- మా అందరి లక్ష్యం వైఎస్సార్ సీపీ గెలుపే
- వైఎస్సార్ సీపీ కార్యాలయం భూమి పూజలో స్థానిక ఎమ్మెల్యే, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, పక్కన మంత్రి సురేష్, ఎంపీ బీదా మస్తాన్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

ఒంగోలు: వచ్చే దసరాకల్లా వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయం నూతన భవనం ప్రారంభోత్సవం జరుగుతుందని పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఇరిగేషన్ కార్యాలయం ఎదురుగా ప్రభుత్వం కేటాయించిన భూమిలో ఆదివారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించిన కార్యక్రమానికి బాలినేని శ్రీనివాసరెడ్డి, రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, మంత్రి ఆదిమూలపు సురేష్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో బాలినేని మాట్లాడుతూ నూతన కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ చేయడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వైఎస్సార్ సీపీ కార్యాలయాలను ఒకే డిజైన్‌తో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. పార్టీ కార్యాలయం నిర్మాణం వల్ల పార్టీ కార్యకర్తలు, నాయకుల్లో మనోధైర్యం నెలకొంటుందని అన్నారు. పార్టీ కార్యాలయాల నిర్మాణం మొత్తం ప్రక్రియను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే పర్యవేక్షిస్తున్నారని, తద్వారా రాష్ట్రంలో నిర్మించే అన్నింటినీ దసరా రోజు ప్రారంభిస్తారన్నారు. పార్టీ బలోపేతానికి ప్రస్తుతం అత్యధిక ప్రాధాన్యత చర్యలు తీసుకుంటున్నారని, అందులో భాగంగానే ఎమ్మెల్యేల బలోపేతానికి చర్యలు ఉంటున్నాయన్నారు.

వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ ఎంపీ బీదా మస్తాన్‌రావు మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 12 నియోజకవర్గాలను వైఎస్సార్‌సీపీ గెలుచుకోవడమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలన్నారు. పార్టీ బలోపేతంగా ఉంటే అందులో ఉండే ప్రతి నాయకుడు, కార్యకర్తకు ఉండే భరోసా చెప్పలేనిదని, అది మర్చిపోరాదన్నారు. వైఎస్సార్‌సీపీలో సామాజిక న్యాయానికి పెద్ద పీట వేస్తున్నారని, అందుకు నిదర్శనం 9 రాజ్యసభ ఎంపీ సీట్లు ఉంటే అందులో 4 సీట్లు బీసీలకు కేటాయించడమేనన్నారు. ఉప ముఖ్యమంత్రుల్లో సైతం ఐదుగురికిగాను నలుగురు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలే ఉన్నారన్నారు. చివరకు స్పీకర్ పదవిని కూడా బీసీలకు కేటాయించారని, నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థలు తదితరాల్లో సైతం 75 శాతం పదవులు అట్టడుగు వర్గాలకే దక్కాయన్నారు. గతంలో ఇటువంటి పరిస్థితిని ఎప్పుడూ చూడలేదని, మహిళలకు సైతం సామాజిక న్యాయం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా ఉండేందుకు ముందుకు రావాలన్నారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ 12 సంవత్సరాలుగా అలుపెరగని పోరాటం చేస్తూ ప్రతిపక్షంలో ఉన్నా పార్టీ నాయకులు, కార్యకర్తలను కాపాడుకుంటూ సుదీర్ఘ ప్రయాణాన్ని కొనసాగించామన్నారు. ఈ నేపథ్యంలోనే పార్టీ నాయకులు, కార్యకర్తలకు శాశ్వత కార్యాలయం ఉండడం ద్వారా పార్టీని మరింతగా బలోపేతం చేయడం సాధ్యమవుతుందని భావించి పార్టీ కార్యాలయ నిర్మాణంలో అడుగు ముందుకు వేయడం శుభపరిణామమన్నారు.

పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు పునాది రాళ్లు వేసి ప్రజలను మభ్యపెట్టాలనుకోవడం చంద్రబాబు పని అని విమర్శించారు. ఎన్టీఆర్ కంటే ముందే వెలిగొండ ప్రాజెక్టు ఆకాంక్ష పశ్చిమ ప్రకాశంలో ఉందని, కానీ 1996 మార్చిలో ఎన్నికలు వస్తున్నాయనగా చంద్రబాబు హడావుడిగా శిలాఫలకం మాత్రమే వేశారన్నారు. కానీ వైఎస్ రాజశేఖరరెడ్డి నిధులు కేటాయించి పనులు వేగవంతం చేస్తే ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే ఒక టన్నెల్ పూర్తిచేసి రెండో టన్నెల్ పూర్తిచేసేందుకు వడివడిగా అడుగులు వేస్తున్నారన్నారు. త్వరలోనే వెలిగొండ ప్రాజెక్టును సైతం ప్రారంభించుకుంటామని, కళ్లుండి అభివృద్ధిని చూడలేని వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. మన లక్ష్యం మాత్రం 175 సీట్లు గెలుచుకోవడమే అని, ఆ దిశగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, జగనన్న సైన్యం సేవలు ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్సీ పోతుల సునీత, ఎమ్మెల్యేలు కుందురు నాగార్జున రెడ్డి, మద్దిశెట్టి వేణుగోపాల్, అన్నా రాంబాబు, బుర్రా మధుసూదన్ యాదవ్, కరణం బలరామకృష్ణమూర్తి, నగర మేయర్ గంగాడ సుజాత, వ్యవసాయ, మార్కెటింగ్ విభాగం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, మాజీమంత్రి శిద్దా రాఘవరావు, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు, కసుకుర్తి ఆదెన్న, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసు వెంకయ్య, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కటారి శంకర్, మేదర కార్పొరేషన్ చైర్‌పర్సన్ కేతా లలిత నాంచారమ్మ, దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర, చాత్తాడ శ్రీవైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కుమార్, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ ఆదిశేషగిరిరావు, వైఎస్సార్ సీపీ ఎంఎల్‌సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



శంకుస్థాపన పూజలో పాల్గొన్న బాలినేని, ఆదిమూలపు, జంకె, జెడ్పీచైర్‌పర్సన్ వెంకాయమ్మ తదితరులు

సీఎంకు కృతజ్ఞతలు

- బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు

ఒంగోలు: 136 కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి తమకు పదవులు ఇవ్వడమే కాకుండా తాజాగా తమ పదవుల గడువును మరికొంత కాలం పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడం పట్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మేదర కార్పొరేషన్ చైర్‌పర్సన్ లలిత నాంచారమ్మ మాట్లాడుతూ బీసీలంటే బ్యాక్‌వర్డ్ కాదని, బ్యాక్‌బోన్ అంటూ ఆత్మస్థైర్యాన్ని నింపారన్నారు. తమ సామాజికవర్గాల సమస్యలను నేరుగా ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్తూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు తమకు అవకాశం కలిగిందని, ఇందుకు ప్రతిఫలంగా 2024లో ముఖ్యమంత్రిగా మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటామన్నారు. సూర్యబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి కరుణాకర్ మాట్లాడుతూ నగర ప్రజల దాహార్తి సమస్యను తీర్చేందుకు రూ.339 కోట్లు విడుదల చేయించినందుకు తాము ఆయనకు ఘన స్వాగతం పలికితే దామచర్ల దానిని తప్పుబడుతూ విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిధులు తెప్పించి మంచి పనులు చేస్తుంటే స్వాగతించాల్సిందిపోయి ఏదో ఒక విధంగా విమర్శలు చేయడం ద్వారా స్థాయిని తగ్గించుకోవద్దని హితవు పలికారు.

ఫ్లెక్సీ చించారంటూ ఆరోపణలు చేసే దామచర్లకు స్థానిక ట్రంకురోడ్డు నుంచి కమ్మపాలెం వరకు వందకుపైగా ఫ్లెక్సీలు చించింది మీ హయాంలో కాదా అంటూ నిలదీశారు. ఒకసారి ఎమ్మెల్యేగా, పదేళ్లు పార్టీ అధ్యక్షునిగా పనిచేసి చవుకబారు మాటలు మాట్లాడి పలుచన కావొద్దంటూ హితవు పలికారు. సమావేశంలో రజక కార్పొరేషన్ డైరెక్టర్ మార్శెళ్ల శ్రీదేవి శ్రీనివాస్, కృష్ణ బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ తిర్లిక శ్రీనివాసరావు, భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్ రాజు, విశ్వబ్రాహ్మణుల కార్పొరేషన్ డైరెక్టర్ గోనుగుంట రజని, నూర్‌బాషా కార్పొరేషన్ డైరెక్టర్ సోఫియా, మత్స్యకారుల కార్పొరేషన్ డైరెక్టర్ వాయల సుమతి ఉన్నారు.



మాట్లాడుతున్న మేదర కార్పొరేషన్ చైర్‌పర్సన్ కేతా లలిత నాంచారమ్మ

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ వెటరన్ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: స్థానిక లార్డ్ కృష్ణా షటిల్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వెటరన్ క్రీడాకారుల జిల్లాస్థాయి ఎంపిక ఉత్సాహంగా సాగింది. లార్డ్ కృష్ణా షటిల్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి మురళీకృష్ణ పోటీలను పరిశీలించి విజేతల వివరాలను వెల్లడించి వారికి ట్రోఫీలు, ప్రశంస పత్రాలు అందించారు. 35 ఏళ్ల వయస్సు మొదలు 70 ఏళ్ల వరకు వయస్సుల వారీగా క్రీడాకారుల ఎంపిక నిర్వహించామని మురళీకృష్ణ తెలిపారు. ఎంపికైన వారు ప్రొద్దుటూరులో జరిగే రాష్ట్రస్థాయి వెటరన్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి విజయ్‌కృష్ణ, కోశాధికారి అశోక్‌రెడ్డి, నితిన్‌రెడ్డి, మురళి, వెంకట సుబ్బారావు, రఘుబాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగును కాపాడుకునే బాధ్యత అందరిపై ఉంది

ఒంగోలు టౌన్: దేశ భాషలోనే ఎంతో గొప్ప భాషగా ప్రపంచమంతా కొనియాడిన తెలుగు భాషను కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ కళాపరిషత్ లో ఆదివారం 'తెలుగు లోగిలి' ఆధ్వర్యంలో గ్రంథావిష్కరణ సభ నిర్వహించారు. సభకు నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ అధ్యక్షత వహించారు. డాక్టర్ నూనె అంకమరావు రచించిన 'తెలుగు కవితా ప్రభ,' కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి రచించిన 'కవిత్వమై కురిసిన కవి' అనే గ్రంథాలను ఆవిష్కరించి కవులను అభినందించారు. తెలుగు భాష ప్రమాదంలో ఉందని పునరుద్ఘాటించారు. తెలుగు ప్రజలు తమ మాతృభాషను కాపాడుకోలేక పోతే భవిష్యత్తులో చాలా నష్టపోతారని హెచ్చరించారు. రాష్ట్ర విభజన వల్ల తెలుగు జాతికి, సంస్కృతికి నష్ట జరిగిందని, వాటి గురించి మాట్లాడే వారే లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణకు భైరపల్లి సుబ్బరత్తమ్మ, ఆదిశేషయ్య స్మారక సాహితీ పురస్కారం–2022ను అందజేశారు. కార్యక్రమంలో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు మాడభూషి సంపత కుమార్, సాహితీవేత్తలు గుత్తికొండ సుబ్బారావు, వి.సుబ్బారావు, కుర్రా ప్రసాదరావు, యువీ రత్నం, భైసరపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు కవయిత్రులను సన్మానించారు. సభలో బాలికలు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు ఆకట్టుకున్నాయి.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మండలి బుద్ధప్రసాద్, వేదికపై కవులు, రచయితలు

ఉత్సాహంగా సాక్షి స్పెల్ బీ

- సెమీ ఫైనల్ రౌండ్‌లో హాజరైన 120 మంది విద్యార్థులు

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): ఇంగ్లిష్ భాషపై విద్యార్థులకున్న భయాన్ని తొలగించేందుకు సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెల్ బీ సెమీ ఫైనల్ పరీక్ష విజయవాడ నగరంలోని నలందా విద్యానికేతన్ స్కూల్ ఆవరణలో ఆదివారం ఉత్సాహపూరిత వాతావరణలో నిర్వహించారు. 1 నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులను తరగతిని బట్టి నాలుగు గ్రూపులుగా విభజించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి మొత్తం 120 మంది విద్యార్థులు హాజరయ్యారు. 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షలకు మెయిన్ స్పాన్సర్‌గా డ్యూక్స్ వాఫీ, రాజమండ్రిలోని ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ అసోసియేషన్ స్పాన్సర్‌గా వ్యవహరించారు.



సాక్షి స్పెల్ బీ పరీక్షకు హాజరైన విద్యార్థులు

ఇంగ్లిష్‌పై ఇష్టం పెరిగింది



ఇంగ్లిష్‌పై గతంలో కొంత భయం ఉండేది. సాక్షి స్పెల్ బీ పరీక్షలకు హాజరవుతుండటంతో ఇంగ్లిష్‌పై ఉన్న భయం మెల్లగా తగ్గి ఇష్టం పెరిగింది. స్పెల్లింగ్స్‌తో సహా చదవాలనే విషయం తెలిసింది. కొత్త పదాలను తెలుసుకోవడమే కాకుండా వాటి అర్థాలు కూడా తెలిశాయి.

– ఎం.అక్షయ, 9వ తరగతి, ప్రకాశం జిల్లా

చేతికి కట్టుతోనే పరీక్షకు హాజరైన అభ్యర్థి






మహిళా అభ్యర్థుల హాల్‌టికెట్లు, ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది

హాజరు.. 20,775

- పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థుల ప్రాథమిక పరీక్ష ప్రశాంతం
- పలు కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ మలికాగర్గ్





పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మలికాగర్గ్



భర్త, పిల్లలతో పరీక్షకు వస్తున్న అభ్యర్థి

ఒంగోలు టౌన్: పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆదివారం నిర్వహించిన ప్రాథమిక రాత పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించారు. తొమ్మిది గంటల నుంచే అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. ఒంగోలులో ఏర్పాటు చేసిన 17 కేంద్రాల్లో 13,334 మంది, మార్కాపురంలో ఏర్పాటు చేసిన 21 కేంద్రాల్లో 7,441 మంది కలిపి మొత్తం 20,775 మంది జిల్లాలో పరీక్ష రాశారు. మొత్తం 22,281 మందికిగాను 1,506 మంది గైర్హాజరయ్యారు. ఒంగోలు నగర సమీపంలోని వల్లూరు వద్ద గల పేస్ ఇంజినీరింగ్ కాలేజీ పరీక్ష కేంద్రాన్ని, ఎస్ఎస్ఎన్ డిగ్రీ కాలేజీ పరీక్ష కేంద్రాన్ని ఎస్పీ మలికాగర్గ్ సందర్శించారు. భద్రతా ఏర్పాట్లు, పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రశాంతంగా పరీక్ష జరగడంపై ఎస్పీ సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది సహకారంతోనే సాధ్యమైందని తెలిపారు.



మహిళా అభ్యర్థికి తల్లి ప్రేమ



పరీక్ష కేంద్రం వద్ద తండ్రీకూతుళ్లు



ఒంగోలులోని క్విస్ కాలేజీ పరీక్ష కేంద్రానికి హాజరైన కానిస్టేబుల్ అభ్యర్థులు





చివరి నిమిషంలో పరీక్ష కేంద్రానికి పరిగెడుతున్న అభ్యర్థులు



పరీక్షకు హాజరైన యువకులు



యువకులను తనిఖీ చేస్తున్న పోలీస్ సిబ్బంది



క్యూలో వేచి ఉన్న మహిళా అభ్యర్థులు

క్లుప్తంగా

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

- రూ.3 లక్షల నష్టం



కాలిపోయిన ఏసీ

బేస్తవారిపేట: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. ఈ సంఘటన స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే..బొల్లవరపు వెంకట సుబ్బారెడ్డికి చెందిన గృహంలో షార్ట్ సర్క్యూట్‌తో ఏసీ, బీరువా, డబుల్‌కాట్, ఫ్రిజ్, టీవీ, బెడ్‌రూమ్‌లోని దుస్తులు దగ్ధమయ్యాయి. గృహంలో ఎవ్వరూ లేని సమయంలో సంఘటన జరిగింది. చుట్టుపక్కల వారు గృహంలో నుంచి పొగ వస్తుండటంతో బంధువులకు సమాచారం ఇచ్చారు. కంభం అగ్నిమాపకదళ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో రూ.3 లక్షల నష్టం వాటిల్లిందని అగ్నిమాపకదళ అధికారులు తెలిపారు.

29న యాదవ మహాసంఘ జిల్లా స్థాయి సమావేశం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యాదవ సంఘ నాయకులు

ఒంగోలు: అఖిల భారత యాదవ మహాసంఘ జిల్లా స్థాయి సమావేశాన్ని ఈ నెల 29న మార్కాపురంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు మేకనబోయిన గురుప్రసాద్ యాదవ్ తెలిపారు. ఒంగోలులోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో సంబంధిత ఆహ్వాన పత్రికలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయంత్రం 4 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి కారుమూరి నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్‌రావు యాదవ్, కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ హాజరవుతారన్నారు. యాదవుల భవిష్యత్తు, చైతన్యం, సామాజిక, రాజకీయ రంగాల్లో యాదవుల ఉన్నతి గురించి చర్చించనున్నట్లు, తెలిపారు. యాదవులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సైనికుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

- వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



ఆర్మీడేలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు టౌన్: ప్రతికూల వాతావరణాన్ని సైతం లెక్క చేయకుండా దేశ పరిరక్షణ కోసం పాటుపడుతున్న సైనికుల త్యాగాలు నేటి యువతరానికి స్ఫూర్తిదాయకమని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఇండియన్ ఆర్మీ డే ఘనంగా నిర్వహించారు. సభకు చుండూరి శ్రీరామమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బాలినేని మాట్లాడుతూ విశ్రాంత సైనికుల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విశ్రాంత సైనికుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. సైనికుల త్యాగాలను జాతి గర్వంగా చెప్పుకుంటుందని కొనియాడారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ సైనికుల త్యాగాల వల్లే దేశంలోని ప్రజలు ధైర్యంగా జీవించగలుగుతున్నారని అన్నారు. ఆర్మీ పుట్టు పూర్వోత్తరాల గురించి నెప్పల్ల నాగేశ్వరరావు వివరించారు. కార్యక్రమంలో రమేష్ హాస్పిటల్ సీఎన్ఓ బి.ఉషాదేవి, జిల్లా విశ్రాంత సైనికుల సంక్షేమ సంఘం నాయకులు జి.శ్రీనివాసాచార్యులు, ఎల్.జగన్‌రెడ్డి, సురేంద్ర, సైనిక సంక్షేమ అధికారి రజనీకుమారి, గుమ్మడి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణపై ఉన్నతస్థాయి సమావేశం

- 4వేల ఎకరాల భూసేకరణపై అధికారులతో కలెక్టర్ సమీక్ష



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

కందుకూరు: పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా గుడ్లూరు మండలంలోని రావూరు, చేవూరు గ్రామాల్లో చేపట్టిన భూసేకరణపై కలెక్టర్ చక్రధరబాబు ఆదివారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ రెండు గ్రామాల్లో ఇండోసోల్ అనే సోలార్ ప్యానల్స్ తయారీ కంపెనీ భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఈ పరిశ్రమ ఏర్పాటుకు దాదాపు 4వేల ఎకరాల భూములు అవసరమవుతాయని గుర్తించారు. ఈ మేరకు రావూరు, చేవూరు గ్రామాల పరిధిలో అవసరమైన భూసేకరణ చేసేందుకు అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. పరిహారం విషయంలో కొందరు రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం ఆ రెండు గ్రామాల నుంచి కొందరు ప్రతినిధులను ఆహ్వానించి కలెక్టర్ చర్చలు చేశారు. రైతుల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుంటామని, పరిహారం విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు రైతుల ప్రతినిధులు తెలిపారు. భూసేకరణకు తీసుకోవాల్సిన చర్యలు, గ్రామాల ప్రజలు ప్రధానంగా ఏ అంశాలపై అభ్యంతరం చెప్తున్నారు అనే విషయాలను అధికారులతో చర్చించారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ రావూరు, చేవూరు గ్రామాలకు సంబంధించి 8 మంది ప్రతినిధులతో ఒక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. భూసేకరణకు సంబంధించి గ్రామాల ప్రజలతో సమన్వయం చేసుకునేందుకు ఈ కమిటీ పనిచేస్తుందన్నారు. భూముల కోల్పోతున్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి, జేసీ కూర్మనాథ్, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, లైజనింగ్ ఆఫీసర్ ఐవీ రెడ్డి, రామాపట్నంపోర్టు సీఈఓ ప్రతాప్‌రెడ్డి, ఇన్‌చార్జి ఆర్డీఓ శ్రీనానాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి



రహదారి ప్రమాదంలో మృతి చెందిన మహిళ

కొమరోలు: గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని కడప–అమరావతి రాష్ట్రీయ రహదారిలో కత్తులవానిపల్లె గ్రామ సమీపంలోని జగనన్న కాలనీ వద్ద శనివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కాలినడకన రహదారి వెంట వెళుతున్న మహిళను గుర్తు తెలియని వాహనం వేగంగా ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మహిళ వివరాలు తెలియరాలేదు. మహిళ మృతదేహాన్ని ఎవరైనా గుర్తు పడితే కొమరోలు పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై ఎ.సుబ్బరాజు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పెదపట్టపుపాలెం విద్యార్థినులు



కబడ్డీ పోటీలకు ఎంపికైన పెదపట్టపుపాలెం విద్యార్థినులు

ఉలవపాడు: రాష్ట్రస్థాయి అండర్ 17 కబడ్డీ పోటీలకు పెదపట్టపుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రమణయ్య తెలిపారు. పదో తరగతి చదువుతున్న ఆవుల శాంతి, ఆవులసాయిశ్రీ, వాయలశశిరేఖలు రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు తరఫున ఆడనున్నారు. గత నెలలో మార్కాపురం డివిజన్ గద్దలగుంట వద్ద జరిగిన ఎంపికలో వీరిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో విజయనగరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు. వీరిని, వ్యాయామ అధ్యాపకుడు ప్రభాకర్‌ను పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



విజయలక్ష్మి

సింగరాయకొండ: పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థిని కె.వి జయలక్ష్మి అండర్-17 విభాగంలో స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ పిల్లి హజరత్తయ్య తెలిపారు. మార్కాపురం గజ్జలకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కబడ్డీ రాష్ట్రస్థాయి ఎంపికలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విజయలక్ష్మిని ఎంపిక చేసినట్లు ఆయన వివరించారు. ఈ నెల 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం అలుగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నట్లు వివరించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విజయలక్ష్మిని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు.